క్లుప్తంగా


వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ, శివ.. స్వామి అమ్మవార్లకు ఉదయాన్నే నిత్యపూజలు గావించి పట్టు వస్త్రాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన, వడమాల, ఆకుపూజలు చేశారు. అర్చకులు లక్ష్మణస్వామి,భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



నవధాన్యాలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ మహోత్సవాన్ని పురస్కరించుకొని రెండవ రోజు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టి నవధాన్యాలతో అలంకరించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, మహిళా మండలి అధ్యక్షురాలు ఇందుమతి మాట్లాడుతూ ఆదివారం అమ్మవారికి వజ్రకిరీట ధారణ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గోస్పాడు:గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక గర్భిణులకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం మాతా శిశు సంరక్షణ సేవలపై రికార్డులను, సక్రమంగా నమోదు చేయాలని, ప్రసవ ప్రణాళికల గురించి వివరించారు. డాక్టర్ గోపాల్ ఉన్నారు.

హరితవనం నిర్మాణానికి భూమి పూజ

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని పీవీ నగర్ వద్దనున్న మున్సిపాలిటీ హిందూ శ్మశాన వాటిక స్వర్గధామంలో బృందావన హరితవన నిర్మాణానికి నవ నిర్మాణ సమితి సభ్యులు శనివారం భూమి పూజ చేశారు. డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.10లక్షలతో హరిత వనం నిర్మిస్తునట్లు చెప్పారు. ఇందులో 27నక్షత్రాలతో పాటు 27 మొక్కలను, 12 రాశులకు గాను వాటికి సంబంధించిన మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. మైహోమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో రెండు నెలల్లో నిర్మాణం పూర్తిచేస్తామని వివరించారు.

రవాణా రంగాన్ని కాపాడుకుందాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలు రవాణా రంగ కార్మికుల పాలిట శాపంగా మారాయని, వాటిని ఉపసంహరించుకొనేంత వరకు ఐక్యంగా పోరాడుదామని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆటో, లారీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ చర్యలతో ఈ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులైన అనేక మంది ఆటో, లారీ, బస్సు, కారు, జీపు తదితర వాహనాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రమేష్‌బాబు, కరీముల్లా, ఖాజా, శీను, రమేష్, సురేంద్ర పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. అన్నదానం

- నంద్యాలలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయంలో మాలధారులకు ప్రత్యేక ఏర్పాట్లు
- శివస్వాములకు ప్రత్యేక పూజలు, భిక్ష, వసతి కల్పిస్తున్న నిర్వాహకులు
- 24 ఏళ్ల నుంచి సాగుతున్న కార్యక్రమం
- ప్రస్తుతం రోజుకు 600 మందికి అన్నదానం
- సహకరిస్తున్న దాతలు



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న శివమాలధారులు



భిక్ష స్వీకరిస్తున్న శివస్వాములు

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి ఆధారిత సేవా కార్యకలాపాలకు నంద్యాల కేంద్రంగా విరాజిల్లుతోంది. పట్టణంలోని గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి దేవస్థానంలో మాఘమాసం సందర్భంగా శివ మాలధారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూజలు చేసుకునేందుకు అవకాశం, అలాగే భిక్ష ఏర్పాటు, ఇతర ప్రాంతాల వాసులకు వసతి సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీక్షధారులు రోజూ ప్రత్యేక పూజలు చేసుకోవడం ఆనవాయితీ. వారికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రస్తుతం రోజూ 600 మందికి అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమం 2002లో గుడిపాటి ప్రసాద్, మిద్దె సుబ్బయ్య ప్రారంభించగా.. మొదట్లో వంద మందితో మొదలై నేడు రోజుకు 600 మందికి పైగా అన్నదానం చేస్తున్నారు.

12 రకాల వంటలతో భోజనం..

ఎస్వీవై రెడ్డి సహకారంతో 20 ఏళ్ల క్రితం అన్నదాన మండపాన్ని నిర్మించారు. మాఘమాసం మొదలుకొని శివరాత్రి వరకు మధ్యాహ్నం సమయంలో 12 రకాల వంటకాలతో రోజూ భోజనాలు వడ్డిస్తున్నారు. భిక్ష కార్యక్రమానికి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మల్లికార్జునస్వామి దేవస్థానంలో పూజలు, భిక్ష కార్యక్రమాలతో పాటు వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. దాతలు, మాలధారులు తమకు తోచినంత నిర్వాహకులు, లేదా హుండీలో కానుకలు సమర్పిస్తుండటంతో కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది.

ప్రత్యేక పూజలు..

గురుస్వామి శంకర్, మురళీమారాజ్ ఆధ్వర్యంలో రోజూ ఉదయమే మల్లికార్జుస్వామి వారికి పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక అభిషేకాలు, మధ్యాహ్నం శివస్వాములతో సామూహిక పుష్పాభిషేకాలు, శంఖానాథం, డమురుక నాథం, మహా మంగళ హారతులు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం భజనలు, సత్సంఘం నిర్వహిస్తారు.

దాతల సహకారంతో..

శాశ్వత దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం కొనసాగుతోంది. ఒక్క రోజు భిక్షకు రూ.8వేలు చెల్లిస్తే దాతల పేర్ల మీద ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అన్నదానం చేసే తీరును గమనించి ఏటేటా దాతల సహకారం పెరుగుతుండటం విశేషం. అన్నదాన కార్యక్రమానికి రోజుకు రూ.25వేల నుంచి రూ.30వేలు ఖర్చు అవుతుందని కమిటీ సభ్యులు చెబుతున్నారు.సోమ, శుక్రవారాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. విరాళాలను 41రోజుల పాటు భోజన కార్యక్రమాలకు మిగిలిన నగదును దేవస్థాన అభివృద్ధికి ఖర్చు చేస్తామని పేర్కొంటున్నారు.

మాల ధరించినప్పడల్లా నంద్యాలకు వస్తుంటా



మాది బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామం. పదేళ్ల నుంచి మాల స్వీకరిస్తున్నారు. నంద్యాలకు వచ్చి ఇతర పనులు ముంగించుకొని హోటళ్లకు వెళ్లకుండా మల్లికార్జునస్వామి దేవాలయంలో పూజలు చేసుకొని ఇక్కడే భిక్ష, వీలైతే రాత్రి సమయాల్లో బస చేస్తుంటా. ఇంట్లో వసతి లేనప్పుడు కూడా అన్నదాన కమిటీ వారు ఏర్పాటు చేసిన గదుల్లోనే ఉంటాను. –నాగపుల్లయ్య, పెద్దదేవళాపురం

20 ఏళ్లుగా దీక్ష స్వీకరిస్తున్నా



20 ఏళ్లుగా శివమాల స్వీకరిస్తున్నా. ప్రతి సంవత్సరం స్వాముల సంఖ్య పెరుగుతూనే ఉంది. నంద్యాల పట్టణంలో దాదాపు 10 వేల మంది దీక్ష తీసుకున్నారు. మాలధారులకు ఇక్కడే భిక్ష, పూజలు చేసుకునే వెసులుబాటు ఉండటం, దూర ప్రాంతవాసులకు వసతి కూడా కల్పిస్తున్నారు. దీక్ష వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన, సమాజసేవ వంటివి అలవడతాయి.–శంకర్, గురుస్వామి, నంద్యాల

భిక్ష కోసం ఇబ్బంది పడొద్దు



వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన శివ మాలధారులు ఆర్థాకలితో భిక్ష కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో 20 ఏళ్ల నుంచి భిక్ష ఏర్పాటు చేశాం. రోజూ 600 మందికి పైగానే పూజలు నిర్వహించుకొని భిక్ష స్వీకరిస్తున్నారు. దాతల సహకారంతోనే ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది.
– మిద్దె సుబ్బయ్య, అన్నదాన కమిటీ అధ్యక్షుడు

పేరొకరిది.. ప్రచారం మరొకరిది

నంద్యాల(సిటీ): పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన కోసం మెగా సైన్యం అంటూ ఆర్భాటంగా ప్రచార సభను పార్టీ పట్టణ నాయకులు నిర్వహించారు. అయితే ఈ సమావేశం పూర్తిగా టీడీపీ నాయకుడికి వత్తాసు పలకడానికి నిర్వహించిన సభగా మారిపోయింది. శనివారం శోభ హోటల్ నుంచి చెరువుకట్ట వరకు సాగిన ర్యాలీలో యువత పాల్గొన్నా ఇందుకు సామాన్య ప్రజల మద్దతు లభించలేదు. కేవలం టీడీపీ నాయకుడిని గెలిపించడానికి చేసిన ప్రయత్నంగా మారింది. ఆతిథ్యం ఇచ్చింది జనసేన పార్టీ నాయకులు, సమావేశాన్ని టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా వినియోగించుకున్నారు. సభ ఆసాంతం ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లతో తమ సినిమా డైలాగ్‌లను అభిమానులకు చూపించడమే తప్ప ప్రజలు ఏం కోరుకుంటున్నారు, వారికి తమ నాయకుడు ఏం చేయబోతున్నాడు అనే విషయాలను ప్రస్తావించకపోవడం గమనార్హం.

బీజేపీ పాలనపై ఉద్యమించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలోని బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని వారి పాలనను వ్యతిరేకిస్తూ కార్మికులు, ఉద్యోగులు ఉద్యమించాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకన్న తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. అన్ని పారిశ్రామిక కేంద్రాల్లో విధులు బహిష్కరించి కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేయాలని చెప్పారు. కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు బంద్‌కు సహకరించాలన్నారు. రఘురామ్మూర్తి, రమేష్, బాలకృష్ణ, అబ్బాస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మిట్నాలలో మోడల్ స్కూల్ హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, చిత్రంలో పీపీ నాగిరెడ్డి

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో గతంలో లేని విధంగా అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కానాల నుంచి పాండురంగాపురం వరకు బీటీ రోడ్డు, వంతెన ఏర్పాటుకు రూ.2.30 కోట్లు, మిటాన్ల నుంచి శివరాంపురం వరకు రూ.1.25 కోట్లు ఏర్పాటు కానున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, మిట్నాల గ్రామంలో రూ.2.26 కోట్ల వ్యయంతో నిర్మించిన ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ భవనాన్ని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నకు మరోసారి అండగా నిలవాలని ప్రజలను కోరారు. జగనన్న ప్రజా సంక్షేమం కోసం ఐదేళ్లలో 124 సార్లు బటన్ నొక్కారని, సీఎం చేసిన మంచిపనిని గుర్తించుకొని 2024 ఎన్నికల్లో మీరు రెండు సార్లు బటన్ నొక్కాలన్నారు. ఎంపీపీ ప్రభాకర్, డైరెక్టర్ శశికళారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, డీఈఓ సుధాకర్, ఎంఈఓ బ్రహ్మం పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

నంద్యాల టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేసి వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరారు. శనివారం ఆసుపత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్లుగా ఆసుపత్రిలో పనిచేస్తున్నా తమ కాంట్రాక్టర్ ఎవరో కూడా తెలియడం లేదన్నారు. తమ సూపర్‌వైజర్‌ను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ప్రసాద్, తులసమ్మ, ఓబులేసు కోరారు.

మాజీ సైనికులకు సన్మానం



మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశం కోసం శ్రమించిన మాజీ సైనికులను సన్మానించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు తెలిపారు. మండలంలోని పాండురంగాపురం గ్రామంలోని 8 మంది మాజీ సైనికులను శనివారం సత్కరించారు. మేడా మురళీధర్, గురు బ్రహ్మ, రామకృష్ణారెడ్డి, స్వాతి, గంగాధర్ పాల్గొన్నారు.

వీధి కుక్కలను అరికట్టడానికి సహకరించాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో సంచరిస్తున్న వీధికుక్కలను సంరక్షించి వాటికి ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్), ఏఆర్‌వీ(యాంటీ రేబీస్ వాక్సిన్)లు వేసే ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. నంద్యాల అర్బన్ పరిధిలోని వీధి కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ పద్ధతి ద్వారా ఆపరేషన్లు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సంతులన్ జీవ కళ్యాణ్, రాజస్థాన్ వారికి కౌన్సిల్ తీర్మానించిందన్నారు. ఈ మేరకు ప్రజలు, జంతుప్రేమికులు వారికి సహకరించాలన్నారు. మూడు రోజులగా ఎట్టణంలో వీధి కుక్కలు మరణిస్తున్నాయని వాటిపై పోలీసులకు నివేదించామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. శనివారం నేషనల్ పీజీ కళాశాలలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏసురత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, సీనియర్ టీచర్లకు సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు కల్పించాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచి ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, బాలవెంకట్, శివరాం, శోభారాణి, నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, హరిత, సునిత, రమణమ్మ, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం తొలగింపు



ఆలమూరులో ధ్వజ స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఆలమూరులో ఈశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోనున్న ధ్వజ స్తంభాన్ని శనివారం అధికారుల సమక్షంలో తొలగించారు. ఈఓ సాయి జయచంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం చెక్కది కావడంతో దెబ్బతినిందన్నారు. నూతన ధ్వజ స్తంభం ఏర్పాటులో భాగంగా ప్రస్తుతమున్న దానిని తొలగించాలని ఆలయ కమిటీ తీర్మానించడంతో శాస్త్రోక్తంగా తొలగింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రెవెన్యూ,పోలీస్ ఇతర శాఖల అధికారులు,ఆలయ కమిటీ చైర్మన్ శూలం ప్రభాకర్ ఆధ్వర్యంలో తొలగింపు పనులు నిర్వహించామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాణ్యం నాగేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో 'మాక్ ఎలక్షన్'

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సంజీవనగర్‌లో నున్న సంకల్ప్ పాఠశాలలో శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ ఆధ్వర్యంలో మాక్ ఎలక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు నిర్వహించే విధానాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఎన్నికల విధానంపై అవగాహన కల్పించడం కోసం పాఠశాల విద్యార్థులను ప్రజాప్రతినిధులుగా నియమించి నామినేషన్, ఎన్నికల ప్రచారం, హామీలు తదితర అంశాలు నిర్వహించారు. ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగించే విధానం గురించి వారికి అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం



రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఆర్‌ఎం రజియా సుల్తానా

నంద్యాల టౌన్: సమష్టి కృషితో రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను సామాజిక బాధ్యతగా చూడాలన్నారు.అనంతరం 27 మంది ఆర్టీసి సిబ్బంది రక్తదానం చేయగా వారిని అభినందించారు. డిపో మేనేజర్ గంగాధర రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చౌడేశ్వరరెడ్డికి ఉత్తమ రైతు అవార్డు



తెలంగాణ గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామానికి చెందిన రైతు మూల చౌడేశ్వరరెడ్డి ఉత్తమ చిరుధాన్యాల విత్తనం ఉత్పత్తి చేసే రైతుగా గుర్తించి ఉత్తమ రైతు అవార్డును బహూకరించారు. ఐసీఏఆర్ ఐఐఎంఆర్ ఫౌండేషన్ డే సందర్భంగా గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ వారు ఈ అవార్డును సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సుందరాజన్ చేతుల మీదుగా ఈనెల 9న హైదరాబాద్‌లో అవార్డు అందజేశారు. రైతు మూల చౌడేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆర్ఏఆర్ఎస్, వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు అనుసరించి అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు తెలిపారు. కంది, పెసర, కొర్ర, జొన్న, మినుము, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఐఐఎంఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యావతి, మెహతా పాల్గొన్నారు.

పశుబీమా పాడిరైతులకు వరం



రైతులకు పశుఆరోగ్య సంరక్ష కార్డులను అందజేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: పశుబీమా పథకం రైతులకు వరం లాంటిదని పశువైద్యాధికారి పుల్లయ్య తెలిపారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ పశువైద్యశాలలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు మూడేళ్లకు రూ.384 చెల్లిస్తే పాడిగేదె, ఆవులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.30వేలు, ఏపీఎల్(దారిద్ర్య రేఖకు ఎగువ ఉన్న రైతులు రూ.960 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే గొర్రెలు, మేకలకు సంవత్సరం కాలానికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75, ఇతరులు రూ.90, రూ.135, రూ.187.5 చెల్లిస్తే ఒక్కో గొర్రెకు రూ.6వేలు ఇస్తుందన్నారు. అలాగే పశువులకు వాటి సంఖ్యను బట్టి రూ.3లక్షల వరకు బ్యాంకుల్లో రుణాలకు కూడా ఇస్తారని వివరించారు. అనంతరం పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్ష కార్డులను అందజేశారు. జేవీఓ రమణయ్య, ఉప సర్పంచ్ మహేష్, మాజీ సర్పంచ్ ఉశేనయ్య పాల్గొన్నారు.

పెట్టుబడి అల్పం.. ఆదాయం ఘనం



కానాల సమీపంలో కనువిందు చేస్తున్న ఆవాల పంట

- నంద్యాల జిల్లాలో విస్తారంగా ఆవాల పంట సాగు
- ఏటేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- రెండో పంటగా వేస్తున్న రైతులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో రెండో పంటగా ఆవాల సాగు విస్తరిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 8వేల హెక్టార్లలో పంట సాగైందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తారు. వరి కోతల అనంతరం ఆ పొలాల్లో ఆవాలు జల్లుతున్నారు. అప్పటికే నీటి తడి ఎక్కువగా ఉంటుండటం, అధిక శ్రమ లేకుండా, మందులు కూడా తక్కువ అవసరమవుతుండటం, అలాగే దిగుబడి, ధర బాగుంటుండటంతో జిల్లాలోని రైతులు పంట సాగుకు మక్కువ చూపుతున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం తదితర నియోజకవర్గాల్లోని మండల గ్రామాల్లో ఆవాల సాగు అత్యధికంగా ఉంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట కోతలు అనంతరం ఎకరాకు 2 కేజీల ఆవాల కొనుగోలు చేసి పొలంలో చల్లుతారు. ఒక్కో విడతలో ఒక యూరియా ప్యాకెట్ చొప్పున మూడు బస్తాల యూరియా, నాలుగు విడతలు నీళ్ల మందు పిచికారీ, కోత మిషన్ ఖర్చులు కలిపి ఎకరాకు దాదాపు రూ.9వేలు ఖర్చు అవుతుంది. గత ఏడాది 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు వచ్చాయి. ఈ ఏడాది కూడా 5 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావచ్చని రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం క్వింటా ఆవాలు రూ.14వేల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. మూడు క్వింటాళ్లు దిగుబడి వచ్చినా రూ.42వేలు వస్తాయి. పెట్టుబడి పోనూ ఎకరాకు రూ.30వేలకు పైగా మిగులుబాటు ఉంటుందని అన్నదాతలు వివరిస్తున్నారు. పెట్టుబడులు, శ్రమ తక్కువ కావడంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. కాగా గతేడాది 6,750 హెక్టార్లలో పంట సాగైంది.

మరింత విస్తరించనున్న సాగు



ఆవాల పంట సాగుకు నంద్యాల జిల్లా పొలాలు అనుకూలం. గతంలో పంటకు కలుపు బెడద ఉండేది. ప్రస్తుతం కలుపు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం, పంట ఎదుగుదలకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నారు. దీంతో ఆశించిన మేర దిగుబడులు వస్తున్నాయి. తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం వస్తుండటంతో ఈ పంట సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. జిల్లాలో పంట సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. రైతులకు ఆవాల సాగుపై మరింత అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపడుతాం.
–మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

పీవీకి భారతరత్నపై హర్షం



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించడం హర్షించదగ్గ విషయమని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నంద్యాల నుంచి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. ఆయన హయాంలో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, స్మృతిగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు బాల మురళీకృష్ణ, రాజశేఖర్, చంద్రశేఖర్, భరద్వాజ పాల్గొన్నారు.

14న వసంత పంచమి వేడుకలు

కొత్తపల్లి: కొలను భారతీదేవి ఆలయంలో స్వస్తిశ్రీ శోభక్రుత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పంచమి 14వ తేదీ బుధవారం రోజున వసంత పంచమి వేడుకలను జరుపుతున్నట్లు ఈవో మోహన్ శనివారం తెలిపారు. వేడుకలను భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి పుట్టిన పండుగ, బుధవారం ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీశైలం వారి అందించే పట్టు వస్త్రములతో అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏక వార రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి కార్యక్రమాలు, అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వర స్వామికి ఏపీ ట్రాన్స్ కో ఎస్ఈ డీవీ కృష్ణకుమార్ శనివారం పూజలు నిర్వహించారు. సతీసమేతంగా వచ్చిన వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పండితులు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందించారు.